E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 13-06-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



మరో మూడు రోజులు భారీ వర్షాలు » 3లో

# మహా విషాదం.. 265 మంది దుర్మరణం



ఈ కబురు అహ్మదాబాద్: మాటలకందని పెనువిషాదం. భారత విమానయాన చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటన. గురువారం గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.39 గంటలకు లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ ఏఐ171 విమానం టేకాఫైన 39 సెకన్లలోనే కుప్పకూలింది.

- ఇలా టేకాఫ్ అయి..., కూలిపోతూ..., మంటల్లో...
- ఎయిరిండియా విమానానికి ఘోర ప్రమాదం
- మెడికల్ కాలేజీపై కుప్పకూలి పేలిపోయిన డ్రీమ్‌లైనర్
- 265 మంది దుర్మరణం
- అహ్మదాబాద్‌లో ఘోరం
- విమానంలోని 242 మందిలో బతికింది ఒక్కరే
- మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం రూపానీ సహా 180 మంది భారతీయులే, 53 మంది బ్రిటన్‌వాసులు..
- ఏడుగురిది పోర్చుగల్, ఒకరిది కెనడా
- టేకాఫైన కొద్ది క్షణాలకే కాలేజీ క్యాంటీన్, హాస్టల్‌పై పడ్డ విమానం
- వాటితో పాటు సమీప భవనాలు ధ్వంసం
- హాస్టల్‌లో ఉన్నవారిలో 24 మంది మృతి
- వారిలో ఒక వైద్యుడు, నలుగురు మెడికోలు
- 60 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- శిథిలాల కింద ఇంకా పలువురు ఉండే అవకాశం
- రాష్ట్రపతి, ప్రధాని తదితర ప్రముఖుల దిగ్భ్రాంతి
- ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న సంతాపాలు
- ఘటనాస్థలికి మంత్రులు అమిత్ షా, రామ్మోహన్
- నేడు ప్రధాని మోదీ సందర్శన



## మృత్యుంజయుడు విశ్వాస్‌కుమార్

విమానంలో 11-ఏ సీటులో కూర్చొన్న విశ్వాస్‌కుమార్ రమేశ్ అనే ప్రయాణికుడు అనూహ్యరీతిలో ప్రాణాలతో బయటపడ్డారు. గుజరాత్‌లో ఉన్న తన కుటుంబాన్ని కలిసేందుకు బ్రిటన్ నుంచి విశ్వాస్ రాగా.. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. విశ్వాస్ సోదరుడు కూడా ఆ విమానంలో ఉన్నప్పటికీ ఆయన ఆచూకీ తెలియరాలేదు. కాగా ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికుల సమాచారం కోసం 1800 5691 444 నంబరుతో హాట్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ప్రమాదం తర్వాత అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని కొన్నిగంటలపాటు మూసివేశారు. దాంతో కోల్‌కతా నుంచి చేరాల్సిన ఇండిగో విమానం తిరిగి వెనక్కిమళ్లింది. రాత్రి విమానాశ్రయాన్ని తెరిచారు. సహాయక చర్యల పర్యవేక్షణకు ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో కంట్రోల్‌రూంలు ఏర్పాటుచేశారు. ఘటనపై దర్యాప్తునకు బ్రిటన్ సయితం ఒక బృందాన్ని పంపించింది.

తరువాయి 2లో



అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్

కేవలం 625 అడుగుల ఎత్తుకు వెళ్లగానే విమానంలో అనూహ్య సమస్య తలెత్తింది. దాంతో అది శరవేగంగా కిందికి దూసుకొచ్చింది. చూస్తుండగానే రన్‌వే సమీపంలో మేఘానీనగర్‌లోని బీజే మెడికల్ కాలేజీ, సిటీ సివిల్ హాస్పిటల్ సముదాయంపై పడి ఒక్కసారిగా పేలిపోయింది. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణంలో విమాన ప్రయాణికుల్లో ఒక్కరు మినహా 241 మందీ దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 230 మంది ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు కాగా 53 మంది బ్రిటన్‌వాసులు, ఏడుగురు పోర్చుగల్‌వాసులు, ఒకరు కెనడా పౌరుడు. వీరితో పాటు ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. బ్రిటన్‌లో స్థిరపడ్డ రమేశ్ విశ్వాస్‌కుమార్ బుచర్వాడ (38) అనే ప్రయాణికుడు గాయాలతో బయటపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. విమానం తొలుత మెడికల్ కాలేజీ క్యాంటీన్‌పై పడి పేలిపోయింది. ముక్కలై మంటల్లో కాలిపోతూనే పక్కనున్న బాయ్స్ హాస్టల్ భవనంపైకి దూసుకెళ్లింది. దాంతో రెండు భవనాలూ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాటితో పాటు పరిసరాల్లోని పలు బహుళ అంతస్తుల భవనాలు కూడా మంటలంటుకుని కాలిపోయాయి. ప్రమాద సమయంలో క్యాంటీన్లో చాలామంది వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వారితో పాటు హాస్టల్‌వాసుల్లో కూడా పలువురు ప్రమాదంలో గాయపడ్డారు.

తరువాయి 2లో


అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. 12th ఫెయిల్ నటుడి ఇంట్లో విషాదం » 5లో





భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..» 4లో

పోలీసుల ముందే రెచ్చి-పోయింది.. సోషల్ మీడియాలోనూ చిందులు.. చివరకు..! » 5లో



ఇంగ్లండ్‌తో తొలి టెస్టు.. భారత తుది జట్టు ఇదే! జడేజాకు నో ఛాన్స్? » 6లో





## రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పాఠశాలలు

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రతీచోట తొలి రోజు హడావిడి కనిపించింది. విద్యార్థులకు.. స్థానిక నేతలు, విద్యాశాఖ అధికారులు స్వాగతం పలికారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో స్వాగత బ్యానర్లు, పోస్టర్లు వెలిశాయి. » 3లో



## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాష్, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. » 2లో

## చేనేత.. దేశ వారసత్వ సంపద



భూదాన్ పోచంపల్లిలోని టూరిజం పార్కులో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

- ఇక్కత్ ఒక అద్భుతమైన కళ
- భూదాన్ పోచంపల్లిని సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈ కబురు, యాదాద్రి, భూదాన్ పోచంపల్లి: చేనేత అంటే వస్త్రం కాదని, అది దేశ వారసత్వ సంపద అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు అద్భుతమైన కళాత్మక వృత్తికి చిహ్నమని అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని తన సతీమణితో కలిసి గవర్నర్ సందర్శించారు. చేనేత గృహాలను సందర్శించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. టూరిజం పార్కులోని మ్యూజియంలో ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాలను స్వయంగా పరిశీలించి ఇక్కత్ డిజైన్లు, చేనేత కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.


తరువాయి 2లో



అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. కేంద్రం» 3లో ఎదుట సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని కీలక డిమాండ్

దేవాదాయ భూముల జోలికొస్తే కఠిన చర్యలు : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ » 2లో





హసీనా నోరు మూయించాలని చూస్తే మోదీ అంగీకరించలేదు: యూనస్ » 2లో

ఈ-కబురు
13- 06 -2025
శుక్రవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# మహా విషాదం.. 265 మంది దుర్మరణం





వారిలో కనీసం 25 మంది మరణించినట్టు చెబుతున్నారు! ఒక వైద్యుడు, నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు, వైద్యుని భార్య మృతిని ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించాయి. "60 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు గాయపడ్డారు. వారిలో 19 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది" అని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ పేర్కొంది. వారందరినీ హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగేలా ఉంది. ఇద్దరు ఎంబీబీఎస్ మూడో సంవత్సరం విద్యార్థులు, ఒక వైద్యుని తాలూకు ముగ్గురు బంధువుల ఆచూకీ తెలియడం లేదని కాలేజీ డీన్ డాక్టర్ మీనాక్షీ పారిఖ్ వెల్లడించారు. విమాన శకలాలు, ధ్వంసమై కాలిపోయిన భవనాలు, కార్లు, చెట్లు తదితరాలతో ప్రమాదస్థలి భీతావహంగా మారింది. విమానాశ్రయ, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సైనిక, స్థానిక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ధాటికి దాదాపుగా విమానంలోని వారంతా కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. వారిని బయటికి తీసి ఆ ప్రాంగణంలోనే ఉన్న సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ దారుణంపై భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ దిగ్భ్రాంతికి లోనయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బ్రిటన్ రాజు చార్లెస్-3, ప్రధాని యిర్ స్టార్మర్, పలువురు దేశాధినేతలు, రాజకీయ తదితర రంగాల ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. జరిగింది మాటలకందని దారుణమని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన ఘటనాస్థలిని సందర్శించనున్నారు.

హాస్టల్‌లోకి చొచ్చుకెళ్లిన విమానం

పైలట్ 'మే డే' అలర్ట్

విమానం మధ్యాహ్నం 1.39కి టేకాఫ్ అయింది. 600 అడుగుల పై చిలుకు ఎత్తుకు వెళ్లిందో లేదో సమస్య తలెత్తింది. దాంతో మరింత పైకి వెళ్లాల్సిన విమానం కాస్తా కిందకు రాసాగింది. అప్పటికింకా కనీసం లాండింగ్ గేర్ కూడా పూర్తిస్థాయిలో మూసుకోలేదు! దాంతో తీవ్ర ప్రమాదాన్ని సూచిస్తూ పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు 'మే డే' కాల్ చేశారు. "ఏటీసీ తక్షణం స్పందించి తిరిగి కాల్ చేసినా అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది. పైలట్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు" అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. చుట్టుపక్కల వాళ్లంతా చూస్తుండగానే క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. ప్రమాదం తాలూకు వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరలైంది. విమానం తాలూకు జంట ఇంజన్లలో టేకాఫ్‌కు అవసరమైన పూర్తిస్థాయి థ్రస్ట్ లోపించడమే ప్రమాదానికి కారణమని వైమానిక నిపుణులు భావిస్తున్నారు.

లేదంటే ఇంజన్లను పక్షులు ఢీకొట్టి ఉండొచ్చని కూడా చెబుతున్నారు. ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయంలో కార్యకలాపాలు సాయంత్రం దాకా నిలిచిపోయాయి. "విమానం చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ మెడికల్ కాలేజీలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది నివాస క్వార్టర్లపై కూలిపోయింది. వాటికి మంటలు అంటుకుని లోపలున్న చాలామంది గాయపడ్డారు" అని హరేశ్ షా అనే ప్రత్యక్ష సాక్షి చెప్పుకొచ్చాడు.

విమాన ప్రమాదంలో కుటుంబ సభ్యుడిని కోల్పోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్న మహిళలు

ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం!

ఎవరినీ కాపాడలేకపోయాం: అమిత్ షా

ప్రమాద సమయంలో ఎయిరిండియా విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉన్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. "అదంతా ఒక్కసారిగా అంటుకోవడంతో తీవ్రమైన మంటలు చెలరేగి భరించలేనంత వేడి పుట్టుకొచ్చింది. దాంతో ఎవరినీ కాపాడే అవకాశం లేకుండా పోయింది" అని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించిన అనంతరం మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. "డీఎన్ఏ శాంపిళ్లను ఇప్పటికే సేకరించారు. గుజరాత్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ వర్సిటీ డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తాయి"అని తెలిపారు.

సెకెనుకు 4 లీటర్ల ఇంధనం

విమాన ఇంధనాన్ని జెట్ ఫ్యూయల్ లేదా జెట్ ఏ1 అని పిలుస్తారు. బోయింగ్ 747 విమానం నడవాలంటే భారీగా ఇంధనం కావాలి. సెకెనుకు 4 లీటర్లు ఖర్చవుతుంది. అంటే నిమిషానికి 240 లీటర్లు, గంటకు 14,400 లీటర్లు కావాలన్నమాట. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు సుమారు 6,859 కి.మీ. దూరానికి 9 గంటలపైనే ప్రయాణం. ఎయిరిండియా విమానంలో అంత భారీగా ఇంధనం ఉండటానికి అదే కారణం. విమానం వేగంగా, బలంగా నేలను తాకగానే అంత ఇంధనం ఒకే మండిపోయింది. దాంతో భారీగా మంటలు చెలరేగి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణం తేలాల్సి ఉంది. విమానం బ్లాక్ బాక్స్ కోసం అన్వేషిస్తున్నారు.

మెడికల్ కాలేజీలో హృదయ విదారక దృశ్యాలు

విమాన కుప్పకూలిన బీజే మెడికల్ కాలేజీలో హృదయ విదారక దృశ్యాలు మనసులను మెలిపెడుతున్నాయి. కుప్పకూలిన హాస్టల్ భవనాలు తదితరాల కింద చాలామంది వైద్య విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు చిక్కుకుని ఉంటారని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) తెలిపింది. వారిని వెలికితీసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటిదాకా 265 మృతదేహాలను సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించినట్టు డీఎస్పీ కనన్ దేశాయ్ వెల్లడించారు. మృతుల సంఖ్య భారీగా పెరగవచ్చని ఎఫ్ఏఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దివ్యాన్ష్ సింగ్ అన్నారు. వెలికితీసిన మృతదేహాలన్నీ పూర్తిగా కాలిపోయి ఉన్నాయని చెప్పారు.



మొదటి పేజీ తరువాయి

## దేవాదాయ భూముల జోలికొస్తే కఠిన చర్యలు : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**ఈ కబురు: దేవాదాయ భూముల జోలికొస్తే కఠిన చర్యలు చేపడతామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా కాకుండా చూస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం అవుతున్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు.**

**ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 33/8 లో 10.35 ఎకరాలు, 33/9 లో 13 ఎకరాలు, 33/10 లో 6.23 ఎకరాల చొప్పున మొత్తం 3.28 ఎకరాల భూమిని 1968 లో టీఎల్వీ చారిటబుల్ ట్రస్ట్ కు భూ పట్టదారులైన తోటకూర ఎల్లయ్య యాదవ్ ఇతరులు రామయ్య చౌదరి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సదరు భూమిని 1976 సంవత్సరంలో దేవాదాయ శాఖకు అప్పగించారని తెలిపారు. దేవాదాయ శాఖ భూములు కబ్జాకు పాల్పడిందెవరైన సరే వదిలే ప్రసక్తే లేదని కబ్జా అయిన భూములను స్వాధీనం చేసుకొని కబ్జా దారులపై పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. మంత్రి వెంట పర్యటించిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, దేవాదాయ శాఖ సర్వేయర్లు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ**

మొదటి పేజీ తరువాయి

# చేనేత.. దేశ వారసత్వ సంపద



ఈ కబురు, యాదాద్రి, భూదాన్ పోచంపల్లి: చేనేత అంటే వస్త్రం కాదని, అది దేశ వారసత్వ సంపద అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు అద్భుతమైన కళాత్మక వృత్తికి చిహ్నమని అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని తన సతీమణితో కలిసి గవర్నర్ సందర్శించారు. చేనేత గృహాలను సందర్శించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. టూరిజం పార్కులోని మ్యూజియంలో ఇక్కత్ ప్రస్త్రాల తయారీ విధానాలను స్వయంగా పరిశీలించి ఇక్కత్ డిజైన్లు, చేనేత కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం చేనేత కార్మికులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తాను గతంలో త్రిపుర హ్యాండ్లూమ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న కాలంలోనే పోచంపల్లి ఇక్కత్ పేరు బాగా వినబడేదని, దాంతో ఎలాగైనా పోచంపల్లిని సందర్శించి ఇక్కత్ కళను తెలుసుకోవాలనే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీ సంస్థలను ఇక్కడికి తీసుకొచ్చి చేనేతలో నూతన డిజైన్ల అభివృద్ధి, ఉపాధి తదితర అంశాలపై అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం చేనేత కార్మికులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తాను గతంలో త్రిపుర హ్యాండ్లూమ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న కాలంలోనే పోచంపల్లి ఇక్కత్ పేరు బాగా వినబడేదని, దాంతో ఎలాగైనా పోచంపల్లిని సందర్శించి ఇక్కత్ కళను తెలుసుకోవాలనే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీ సంస్థలను ఇక్కడికి తీసుకొచ్చి చేనేతలో నూతన డిజైన్ల అభివృద్ధి, ఉపాధి తదితర అంశాలపై అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు.

అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీతో నకిలీ ఇక్కత్ వస్త్రాల నిరోధానికి కృషి చేస్తామని అన్నారు. పోచంపల్లికి మిస్‌వరల్డ్ బృందం సందర్శనతో ఇక్కడ 30 శాతం వస్త్రాల కొనుగోళ్లు పెరిగాయని చెప్పడం గొప్పవిషయమని అన్నారు. ఈ ప్రాంతంలోని చేనేత కళాకారులు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ అవార్డు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం చేనేత కార్మికులకు బీమా చెక్కులతో పాటు త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను అందజేశారు.

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. గవర్నర్ స్థాయి లాంటి వ్యక్తులు పోచంపల్లి ఉత్పత్తులను పరిశీలించేందుకు రావడం రెండవసారి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తూ ఆదుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, పలువురు చేనేత కళాకారులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీతో నకిలీ ఇక్కత్ వస్త్రాల నిరోధానికి కృషి చేస్తామని అన్నారు. పోచంపల్లికి మిస్‌వరల్డ్ బృందం సందర్శనతో ఇక్కడ 30 శాతం వస్త్రాల కొనుగోళ్లు పెరిగాయని చెప్పడం గొప్పవిషయమని అన్నారు. ఈ ప్రాంతంలోని చేనేత కళాకారులు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ అవార్డు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం చేనేత కార్మికులకు బీమా చెక్కులతో పాటు త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను అందజేశారు.

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. గవర్నర్ స్థాయి లాంటి వ్యక్తులు పోచంపల్లి ఉత్పత్తులను పరిశీలించేందుకు రావడం రెండవసారి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తూ ఆదుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, పలువురు చేనేత కళాకారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## హసీనా నోరు మూయించాలని చూస్తే మోదీ అంగీకరించలేదు: యూనస్

**బంగ్లాదేశ్ ప్రభుత్వంపై షేక్ హసీనా విమర్శలు చేయకుండా చూడాలని భారత ప్రధాని మోదీని తాను కోరినట్లు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ తెలిపారు.**

ఈ కబురు:విద్యార్థుల ఉద్యమంతో పదవి కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. దిల్లీ నుంచే సామాజిక మాధ్యమాల వేదికగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయమై తాను భారత ప్రధాని నరేంద్రమోదీతో చర్చించానని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తెలిపారు. హసీనాను కట్టడి చేయాలని కోరగా.. దానికి మోదీ అంగీకరించలేదని వెల్లడించారు. లండన్‌లోని చాథమ్ హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని నెలల క్రితం బిమ్‌స్టెక్ సదస్సులో భాగంగా మోదీతో భేటీ అయిన యూనస్.. భారత ప్రధానితో నాటి సంభాషణను గుర్తుచేసుకున్నారు. "హసీనాకు భారత్‌లో ఆశ్రయం కల్పించడంపై నేను మాట్లాడను. అది మీ విధానపరమైన నిర్ణయం. కానీ బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టేలా ఆమె ఆన్‌లైన్‌లో ప్రసంగాలు చేస్తున్నారు. దానివల్ల మా దేశంలో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ విషయంలో మీరు (భారత ప్రధానిని ఉద్దేశిస్తూ) జోక్యం చేసుకోండి. అలాంటి ప్రకటనలు, ప్రసంగాలు చేయకుండా ఆమెను అడ్డుకోండి" అని మోదీని కోరినట్లు యూనస్ తెలిపారు. దీనికి మోదీ బదులిస్తూ.. "అది సోషల్ మీడియా. దాన్ని నియంత్రించడం సాధ్యం కాదు" అని చెప్పినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల ఇంటిపై దాడి

భారత్‌తో సత్సంబంధాలే కోరుకుంటున్నాం.. ఈసందర్భంగా భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆయన మాట్లాడారు. "ఇది మా పొరుగుదేశం. భారత్‌తో బలమైన సంబంధాలు ఉండాలని మేం కోరుకుంటున్నాం. వారితో మాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ, నకిలీ వార్తల కారణంగా మా ప్రయత్నాలకు ఎక్కడో గండి పడుతోందని అనుమానంగా ఉంది" అని యూనస్ పేర్కొన్నారు.

వచ్చే ప్రభుత్వంలో నేను ఉండను..

వచ్చే ఏడాది తొలి అర్ధభాగంలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపైనా యూనస్ స్పందించారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో భాగం కావాలనే ఉద్దేశం గానీ, ఆసక్తి గానీ తనకు లేవన్నారు. ఎన్నికలు సక్రమంగా జరగాలనే తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ పురోగతికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.



# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

**ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాష్, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఎండీగా జె. శంకరయ్య, ఆర్అండ్ఆర్ కమిషనర్‌గా శివకుమార్ నాయుడు, రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఆర్.హనుమంతు, నిజామాబాద్ కలెక్టర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన దాసరి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా లోకేష్‌కుమార్, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను నియమించింది.**

**తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా వల్లూరి క్రాంతి, హ్యూమన్ రైట్స్ కమిషనర్ సెక్రటరీగా నిర్మల క్రాంతి వెస్లీ, ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా నిఖిల్ చక్రవర్తి, సమాచారశాఖ కమిషన్ కార్యదర్శిగా భారతి లక్‌పతి నాయక్, సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శిగా చిట్టెం లక్ష్మి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఈ. నవీన్ నికోలస్, హన్మకొండ కలెక్టర్‌గా స్నేహశబరీష్, స్త్రీ,శిశు సంక్షేమ డైరెక్టర్‌గా శ్రీజన, ఆరోగ్యశ్రీ సీఈవోగా ఉదయ్ కుమార్, ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా చెక్క ప్రియాంక బదిలీ అయ్యారు.**



# మరో మూడు రోజులు భారీ వర్షాలు



ఈ కబురు: రాగల మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ కు రిసే అవకాశం ఉందని తెలిపింది.

దక్షిణ తెలంగాణలో అత్యధిక వర్షాపాతం:

గురువారం రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ వర్షాపాతం నమోదైంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి మహబూబ్ నగర్ లో అత్యధిక వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా వనపర్తి జిల్లా గోపాల్ పేట్ లో 9 సెం.మీ, జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజాలో 7 సెం.మీ, మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ 7 సెం.మీ, నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి లో 7 సెం.మీ, జోగులాంబ గద్వాల్ జిల్లా మద్కల్ 6 సెం.మీ, గట్టు 6 సెం.మీ, మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్బన్ 6 సెం.మీ, బాలా నగర్ లో 6 సెం.మీ, హన్వాడ లో 5 సెం.మీ, నిర్మల్ జిల్లా భైంసా 6 సెం.మీ, జగిత్యాల జిల్లా మల్లాపూర్ లో 5 సెం.మీ, చొప్పున వర్షాపాతం నమోదైంది

## గరిష్ట ఉష్ణోగ్రతలు:

ప్రాంతం నమోదైన ఉష్ణోగ్రత(డిగ్రీ సెల్సియస్ లలో)

ఆదిలాబాద్ -33.8
భద్రాచలం -33.2
హకీంపేట్ -33.1
దుండిగల్ -32.2
హన్మకొండ -31.5
హైదరాబాద్ -33.4
ఖమ్మం -33.4
మహబూబ్ నగర్ -30.2
మెదక్ -30.8
నల్గొండ -36
నిజామాబాద్ -31.4
రామగుండం -33

# సుస్థిరాభివృద్ధి.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

**సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్, : రాయదుర్గం, న్యూస్‌టుడే: సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మాదాపూర్ హెచ్‌ఐసీసీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), గ్రీన్ కో సంయుక్త ఆధ్వర్యంలో 14వ గ్రీన్ కో సమ్మిట్‌ను గురువారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ''ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాల ఉత్పత్తిలో మనది మూడో స్థానం. ప్యారిస్ ఒప్పందం కింద 2070 నాటికి నెట్ జీరో లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇది సాహసోపేత నిర్ణయం. ఇందులో భాగంగా 2030 నాటికి ఇంధన అవసరాల్లో 50శాతం పునరుత్పాదక వనరుల నుంచి తీర్చడానికి కట్టుబడి ఉన్నాం. గ్రీన్ కో ఛత్రం కింద వివిధ రంగాల్లో దేశవ్యాప్తంగా 1,500కుపైగా పరిశ్రమలు హరిత అనుకూల చర్యలు చేపట్టడం అభినందనీయం. క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ 2025 ద్వారా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యం సాధించడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇందిర సోలార్ జల్ వికాస్ పథకాన్ని రూ.12,600 కోట్లతో అమలు చేయడం ద్వారా 6 లక్షల ఎకరాలకు సౌరశక్తితో నడిచే నీటి పారుదల వ్యవస్థలను రూపొందిస్తాం. 2 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. గ్రీన్‌కో రేటెడ్ పరిశ్రమల ద్వారా రూ.5,100 కోట్ల పొదుపు సాధ్యమైంది. అలాగే 194 మిలియన్ కిలోలీటర్ల నీటి సంరక్షణ, 5.7 మిలియన్ టన్నులకుపైగా కర్బన ఉద్గారాల తగ్గింపు, 600 మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు గ్రీన్‌కో కృషికి నిదర్శనం'' అని శ్రీధర్‌బాబు అన్నారు.




# భారత్‌లో ఏఐ జోరు



**కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం మన దేశంలో బహుముఖంగా విస్తరించబోతోంది. ఏఐ ఆవిష్కరణ, అమలు వల్ల ఈ రంగంలో నిపుణుల సంఖ్య భారీగా పెరగనుంది.**

### రెండేళ్లలో నిపుణుల సంఖ్య రెట్టింపు
### 2027 నాటికి 12.5 లక్షల మంది
### అమెరికా తర్వాత స్థానం మనదే
### బీసీజీ నివేదిక వెల్లడి

కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం మన దేశంలో బహుముఖంగా విస్తరించబోతోంది. ఏఐ ఆవిష్కరణ, అమలు వల్ల ఈ రంగంలో నిపుణుల సంఖ్య భారీగా పెరగనుంది. ప్రస్తుతం భారత్‌లో 6 లక్షల మంది ఏఐ నిపుణులు ఉండగా, రెండేళ్లలో ఈ సంఖ్య రెట్టింపునకు మించి 12.5 లక్షలకు చేరుకుంటుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు(బీసీజీ) తాజా నివేదికలో పేర్కొంది.

### ఏఐతోనే విస్తరించిన కంపెనీలివీ..

ఏఐ సాంకేతికను వినియోగిస్తూ తమ సేవలను శరవేగంగా విస్తరిస్తున్న సంస్థలు ఎన్నో ఉన్నాయి. కానీ కొన్ని సంస్థల ప్రస్థానం ఎంతో ఆసక్తికరంగా ఉంది. రేజర్‌పే: ఈ కంపెనీ ఏఐ అసిస్టెంట్లు వ్యాపారుల ఆన్‌బోర్డింగ్ విధానాన్ని సులభతరం చేస్తున్నాయి. కస్టమర్ సపోర్ట్‌లో 80% పని ఏఐతో పూర్తవుతోంది. లెన్స్‌కార్ట్: తమ వినియోగదార్లకు వినూత్న అనుభూతిని అందించడం కోసం ఏఐ ఆధారిత ట్రై-ఆన్స్, ఫేస్-మ్యాపింగ్ టెక్నాలజీలను వినియోగిస్తోంది. పాకెట్ ఎఫ్‌ఎం: కంటెంట్ ఉత్పత్తి ఖర్చును 90% తగ్గించుకుంటోంది. దాదాపు ఒక లక్ష గంటల కంటెంట్‌ను ఏఐతో ఆవిష్కరించడం విశేషం. నోబ్రోకర్: ఏఐ ఆధారిత ఐరిస్ పరిజ్ఞానంతో ఆస్తుల లిస్టింగ్, ఫొటోలను తనిఖీ చేయడం, ఇతర పనులను సులువుగా పూర్తి చేస్తోంది. ఈ సంస్థలు తమ వ్యాపార విభాగాల్లోని ఇతర సంస్థలతో పోల్చితే వేగంగా విస్తరించడానికి ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వీలు కల్పిస్తున్నట్లు స్పష్టమవుతోంది. 16% మంది నిపుణులు భారత్‌లోనే అమెరికా తర్వాత అత్యధిక సంఖ్యలో ఏఐ నిపుణులు ఉన్నది మన దేశంలోనే. ప్రపంచ వ్యాప్త ఏఐ నిపుణుల్లో 16 శాతం మంది ఇక్కడ ఉన్నారు.

### 16% మంది నిపుణులు భారత్‌లోనే

అమెరికా తర్వాత అత్యధిక సంఖ్యలో ఏఐ నిపుణులు ఉన్నది మన దేశంలోనే. ప్రపంచ వ్యాప్త ఏఐ నిపుణుల్లో 16 శాతం మంది ఇక్కడ ఉన్నారు. ఆధార్, యూపీఐ, ఓఎన్‌డీసీ వంటి పబ్లిక్ డిజిటల్ మౌలిక వసతుల వల్ల ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై వ్యాపార సంస్థలు అధికంగా పెట్టుబడులు పెట్టడానికి వీలుకలుగుతోంది. పరిశోధన-అభివృద్ధిపై దృష్టి సారించి, ఏఐ టెక్నాలజీని విస్తరిస్తున్నాయి. 70 కోట్ల మందికి పైగా ఉన్న ఇంటర్నెట్ వినియోగదార్లు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఏఐ అంకుర సంస్థలు పెరగడమూ మేలు చేస్తోంది. గత మూడేళ్లలో 2,000కు పైగా ఏఐ అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయి.

ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వల్ల వ్యాపార సంస్థలు తమ నైపుణ్యాలను, ఉత్పాదకతను పెంచుకోవడమే కాకుండా త్వరగా నిర్ణయాలు తీసుకోవడానికి, తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను విస్తరించటానికి వీలుకలుగుతోంది.

### రూ.1.45 లక్షల కోట్లకు..

భారత్‌లో ఏఐ సేవల మార్కెట్ 2027 నాటికి మూడింతలై 17 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.45 లక్షల కోట్ల)కు చేరుతుందని బీసీజీ అంచనా వేసింది. అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఏఐ ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు సాధిస్తోంది. మన దేశంలో ఇప్పుడు 152 డేటా సెంటర్లు ఉన్నాయి. ఈ ఏడాదిలో కొత్తగా 45 డేటా సెంటర్లు రాబోతున్నాయి. దీనివల్ల 1,015 మెగావాట్ల అదనపు సామర్థ్యం లభించనుంది. దేశవ్యాప్తంగా ఏఐ కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10,000 కోట్లకు పైగా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ సానుకూలతల వల్ల ఇక్కడ ఏఐ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నట్లు ఈ నివేదిక విశ్లేషించింది. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపార సంస్థలకు ఏఐ టెక్నాలజీలను అందిపుచ్చుకోవడం తప్పనిసరి అని, దీనికి ప్రత్యామ్నాయం లేదని పేర్కొంది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. కేంద్రం ఎదుట సీపీఐ ఎమ్మెల్యే

## కూనంనేని కీలక డిమాండ్



ఈ కబురు: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. విమానం పడిన భవనంలో నివసిస్తున్న మెడికల్ విద్యార్థులు సైతం చనిపోవడం తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు. చనిపోయిన ప్రయాణికులకు, విద్యార్థులకు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయాన శాఖ కట్టుదిట్టమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రపంచ ఆరోగ్య సంక్షోభంగా మారుతున్న ఫ్యాటీ లివర్..



**బీసీ మంత్రులకు ప్రాధాన్య శాఖలు కేటాయించాలని, బీసీలను సమాచార కమిషనర్‌గా నియమించాలని బీసీ సంఘాల ప్రతినిధులు కోరారు.**
**వివిధ సంఘాల ప్రతినిధులు**

ఈ కబురు,హైదరాబాద్, : బీసీ మంత్రులకు ప్రాధాన్య శాఖలు కేటాయించాలని, బీసీలను సమాచార కమిషనర్‌గా నియమించాలని బీసీ సంఘాల ప్రతినిధులు కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీ ప్రతినిధులు గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను గాంధీభవన్‌లో కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బడుగులకు ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమాచార కమిషనర్‌ల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని, దీన్ని సరిదిద్దాలని కోరారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్, బీసీ సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, కోఆర్డినేటర్ ఉప్పరి శేఖర్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కురుమ తదితరులు ఉన్నారు. ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని వినతి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని మున్నూరు కాపు సంఘం నేతలు కోరారు. గురువారం 33 జిల్లాలకు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు.

# నెతన్యాహుకు ఊరట



**ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు గురువారం భారీ ఊరట లభించింది. పార్లమెంటు రద్దు ప్రమాదం నుంచి ఆయన తప్పించుకున్నారు.**
**పార్లమెంటు రద్దు నుంచి తప్పించుకున్న నేత**

**మద్దతిచ్చిన సంప్రదాయవాద పార్టీల ఎంపీలు**

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు గురువారం భారీ ఊరట లభించింది. పార్లమెంటు రద్దు ప్రమాదం నుంచి ఆయన తప్పించుకున్నారు. దీంతో ఆయన పదవికి ఇప్పట్లో ఢోకా లేనట్లే. దేశంలో 13శాతంగా ఉన్న సంప్రదాయ యూదులూ సైన్యంలో చేరాల్సిందేనన్న డిమాండుతో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది. దీంతో మరో 6 నెలల వరకూ ఏ బిల్లు ఆమోదం పొందినా పార్లమెంటు అయిన నెస్సెట్ రద్దు కాదు. ఇజ్రాయెల్‌లో ప్రజలు.. సైన్యంలో సేవలందించడం తప్పనిసరి. కానీ జనాభాలో 13శాతం ఉన్న రాజకీయంగా శక్తిమంతమైన సంప్రదాయ యూదులకు దీని నుంచి మినహాయింపు ఉంది. వారు మతపరమైన సంస్థల్లో చదువుకునే పేరుతో సైన్యంలో చేరకుండా మినహాయింపులు పొందుతున్నారు. సైన్యంలో చేరడంవల్ల తమ సంప్రదాయ జీవన విధానానికి భంగం కలుగుతుందని వారు భావిస్తారు. ఇజ్రాయెలీ సంప్రదాయ కుటుంబాలకు చెందిన 13,000 మంది ఏటా 18 ఏళ్ల వయసుకు చేరుకుంటారు. వారిలో కేవలం 10శాతం మందే సైన్యంలో పేర్లను నమోదు చేసుకుంటున్నారు. గాజాపై సుదీర్ఘ కాలంగా యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ యూదులకు మినహాయింపు ఇవ్వడంపట్ల మిగిలిన ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుందని ప్రతిపక్షాలు భావించాయి. ఇందులో భాగంగానే మినహాయింపులను రద్దు చేసే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాయి. అయితే చివరి నిమిషంలో సంప్రదాయ పార్టీలకు చెందిన 18 మందిలో ఇద్దరు ఎంపీలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయడంతో నెతన్యాహు గట్టెక్కారు.

# రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పాఠశాలలు



యాభైరోజుల తర్వాత కలుసు కున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం కనిపించింది. అన్నిచోట్ల తొలిరోజే పాఠ్యపుస్త కాలు, యూనిఫాం అందించారు. మొత్తంగా 50 లక్షల పాఠ్యపుస్తకాలు, 20 లక్షల యూనిఫాం అంద జేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠ శాల ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫాం అందించాలని సీఎం కార్యాలయం అన్ని జిల్లా లకు ఆదేశాలు ఇచ్చింది. పంపిణీ కార్యక్రమాలపై సీఎంవో వివరాలు తెప్పించుకుంది. కొన్ని జిల్లాల్లో పుస్తకాల పంపిణీ ఆలస్యమవ్వడం, మరికొన్ని చోట్ల అందరికీ అందుబాటులో యూనిఫాం లేకపోవడంతో పంపిణీ జరగలేదు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పాఠశాలలను తెరిచే నాటికే.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,852 ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశా లలకు 1,01,66,220 పుస్తకాలు చేరాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. తొలిరోజు పాఠశాల లకు 8,33,398 లక్షల మంది హాజరయ్యారని, వీరిలో 54,52,708 మందికి పుస్తకాలు అందించా మని సీఎంవో పేర్కొంది.

ఈ ఏడాది మొత్తం 20,30,667 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి రోజు పాఠశాలలకు హాజరైన 8,33,398 విద్యార్థులకు ఒక జత యూనిఫాంలను ఉపాధ్యాయులు అందజేశారు. రెండో జత త్వరలో అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. ఈ ఏడాది నుంచి పాఠశా లల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. దీనికి సంబంధించిన పుస్తకాలను కూడా విద్యార్థులకు అందజే శారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో తొలి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా నమోదైంది.




## అదానీ గ్రూప్ నుంచి మరో ఐపీఓ!

**బిలియనీర్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ నుంచి మరో కంపెనీ ఐపీఓకి రానుంది.**

గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ నుంచి మరో కంపెనీ ఐపీఓ కి రానుంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ విమానాశ్రయ నిర్వహణ సంస్థ అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ ను పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలని చూస్తోంది. ఎయిర్‌పోర్ట్స్ విభాగాన్ని 2027 నాటికి ఐపీఓ ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ చేయనుంది. 2027 మార్చి నాటికి ఈ కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. అదానీ గ్రూప్ వృద్ధి వ్యూహంలో భాగంగా రానున్న కొన్ని సంవత్సరాల్లో వివిధ వ్యాపారాల్లో రూ.8 లక్షల కోట్లు (100 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టనుంది. ప్రస్తుతం అదానీ గ్రూప్ భారత్‌లో ఎనిమిది విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటిలో భారత ఆర్థిక రాజధాని ముంబయి సమీపంలోని నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. ఇది త్వరలోనే ప్రారంభం కానుంది. సంస్థ తన మూలధన వ్యయ ప్రణాళికను రెట్టింపు చేసింది. గత పదేళ్లలో ఖర్చు చేయాలనుకున్న 100 బిలియన్ డాలర్లను ఇప్పుడు ఐదు నుంచి ఆరేళ్లలోనే పెట్టుబడిగా మార్చేందుకు సన్నాహాలు చేస్తోంది.

గత వారం అదానీ ఎయిర్‌పోర్ట్స్.. అంతర్జాతీయ బ్యాంకుల కన్సార్టియం నుంచి 750 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,400 కోట్ల) రుణాలను తీసుకుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన ఏఏహెచ్ఎల్, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) ద్వారా ఈ రుణాలు పొందింది. ప్రస్తుతం సంస్థకు ఉన్న 400 మిలియన్ డాలర్ల రుణాల రీఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వెచ్చించనుంది. వ్యాపార విస్తరణతో అదానీ గ్రూప్ దేశీయ విమానయాన రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# రిటెయిల్ రుణాలపై దృష్టి సారిస్తున్నాం



**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో.. మూడో త్రైమాసికం నుంచి నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఎం)లో వృద్ధి కనిపించే అవకాశం ఉందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశోక్ చంద్ర అన్నారు.**

**పీఎన్‌బీ ఎండీ అశోక్ చంద్ర**

**హైదరాబాద్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో.. మూడో త్రైమాసికం నుంచి నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఎం)లో వృద్ధి కనిపించే అవకాశం ఉందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశోక్ చంద్ర అన్నారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవలి సమీక్షలో సీఆర్ఆర్‌లో ఆర్‌బీఐ కోత విధించడం వల్ల తమ బ్యాంకుకు రూ.15,000 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయని, వీటిని రుణాలకు మళ్లించడం ద్వారా బ్యాంకుకు వడ్డీ ఆదాయం పెరుగుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 2.93 శాతంగా ఉందని, 202526లోనూ ఇది 2.9 శాతంగా ఉండొచ్చన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపు వల్ల, నిధుల సమీకరణ వ్యయాలూ దిగి వస్తాయని.. డిపాజిట్ రేట్లపై తాము త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రిటెయిల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈల రుణాలపై దృష్టి సారిస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరంలో 1012% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. మొత్తం రుణాల్లో ఇవి 58 శాతానికి చేరుతాయని అంచనా వేశారు. బ్యాంకు నిరర్థక ఆస్తులను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ రుణాల వృద్ధిపైనా ఆశాభావంతోనే ఉన్నట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.35 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు ఇచ్చామన్నారు. ముఖ్యంగా రెన్యూవబుల్ ఎనర్జీ, విద్యుత్తు, స్టీల్, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అప్పులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల కోసం రూ.25 లక్షల వరకూ రుణాలను డిజిటల్ పద్ధతిలో సులభంగా జారీ చేస్తున్నామని తెలిపారు. *







# మళ్లీ రూ.లక్ష దాటిన బంగారం ధర

24 క్యారెట్ల మేలిమి బంగారం ధర మళ్లీ రూ.లక్ష మార్క్ దాటి పరుగులు పెడుతోంది.

**హైదరాబాద్:** బంగారం ధర మళ్లీ పెరుగుతోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, డాలర్ క్షీణత వంటి కారణాలతో అంతర్జాతీయంగా పసిడి ధరల కు మళ్లీ రెక్కలొచ్చాయి. దీన్ని అనుసరించి దేశీయ విపణిలో పుత్తడి ధర మళ్లీ రూ.లక్ష మార్క్ దాటింది. హైదరాబాద్ మార్కెట్లో గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,00,210గా ఉంది. అటు కిలో వెండి ధర రూ.1,08,700 చేరుకుంది. గురువారం నాటి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్‌లో 10 గ్రాముల పుత్తడి ధర రూ.97,650గా ఉంది. క్రితం సెషన్ ముగింపుతో (రూ.96,704) పోలిస్తే ధర 0.97శాతం పెరగడం గమనార్హం. అటు అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 0.6 శాతం పెరిగి 3,372.46 డాలర్లుగా ఉంది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ పసిడి ధర 1.5శాతం మేర పెరిగింది.అమెరికా డాలర్ విలువ క్రమంగా బలహీనపడుతోంది. రెండు నెలల కనిష్ఠానికి పడిపోయింది. దీంతో విదేశీ కొనుగోలుదారులు బులియన్ మార్కెట్‌పై దృష్టిపెట్టారు. అటు మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో బంగారంలో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. ''అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికాచైనా వాణిజ్య ఒప్పందం వంటి కారణాలతో పుత్తడికి డిమాండ్ పెరిగింది. ఇక, కేంద్ర బ్యాంకులు కూడా పసిడిని కీలకమైన రిజర్వ్ ఆస్తిగా భావిస్తూ కొనుగోళ్లు పెంచుతున్నాయి. దీంతో బంగారం ధర పరుగులు పెడుతోంది'' అని ఇండియా బులియన్ అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అక్షా కాంబోజ్ వెల్లడించారు.

## ఒక్క 'సారీ' పోస్ట్‌తో.. మస్క్‌కు రూ.1600 కోట్ల లాభం

**ట్రంప్‌పై చేసిన ఆరోపణలకు తాను చింతిస్తున్నానని మస్క్ చేసిన పోస్ట్ తర్వాత ఆయన సంపద 191 మిలియన్ డాలర్లు పెరిగింది.**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల బహిరంగంగా మాటల యుద్ధానికి దిగిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇప్పుడు కాస్త వెనక్కి తగ్గారు. అధ్యక్షుడిపై తన వ్యాఖ్యలకు చింతిస్తున్నానంటూ పోస్ట్ పెట్టి సయోధ్యకు సిద్ధమయ్యారు. ఈ ఒక్క మాటతో టెస్లా అధినేత సంపద అమాంతం పెరగడం గమనార్హం. మస్క్ పోస్ట్ తర్వాత ఆయన నికర సంపద 191 మిలియన్ డాలర్ల మేర పెరిగింది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.1600 కోట్లకు పైమాటే..!

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'అమెరికా అధ్యక్షుడి పై పెట్టిన నా పోస్టులపై చింతిస్తున్నా. అవి చాలా దూరం వెళ్లాయి' అని ఆయన విచారం వ్యక్తంచేశారు. ఆయన క్షమాపణలను అటు ట్రంప్ కూడా అంగీకరించినట్లు వైట్‌హౌస్ ధ్రువీకరించింది. ఈ పరిణామాలతో అమెరికా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. దీంతో మస్క్ కంపెనీల షేర్లు రాణించడంతో ఆయన సంపద పెరిగింది.

ఫోర్బ్స్ గణాంకాల ప్రకారం.. ఈ 'సారీ' పోస్ట్ తర్వాత మస్క్ నికర సంపద 191 మిలియన్ డాలర్లకు పెరిగి మొత్తం ఆస్తుల విలువ 411.4 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. బుధవారం నాటి అమెరికా మార్కెట్ సెషన్‌లో టెస్లా కంపెనీ షేర్ల విలువ 0.10శాతం మేర పెరిగి 326.43 డాలర్లకు చేరింది. ఇటీవల మస్క్ ట్రంప్ విభేదాల నేపథ్యంలో టెస్లా షేర్లు భారీగా కుదేలైన సంగతి తెలిసిందే. ఒక్కరోజే ఏకంగా 14శాతం మేర పతనమవడంతో.. కంపెనీ మార్కెట్ విలువలో దాదాపు 152 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. ఆ తర్వాత షేర్లు కాస్త కోలుకున్నాయి.

అమెరికా ప్రభుత్వం రూపొందించిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'ను టెస్లా అధినేత వ్యతిరేకించడంతో ట్రంప్‌నకు, ఆయనకు మధ్య దూరం పెరిగింది. ఈక్రమంలో ట్రంప్‌పై మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. సెక్స్ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టైన్‌తో ట్రంప్‌నకు సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తన మద్దతు లేకపోయి ఉంటే అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ నేతలు ఓటమి పాలయ్యేవారని మస్క్ వ్యాఖ్యానించగా.. ఆయన వ్యాఖ్యలను అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులకు, రాయితీలకు కోత వేస్తానని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్ వెనక్కి తగ్గుతూ నిన్న పోస్ట్ చేశారు.





# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 823 పాయింట్లు, నిఫ్టీ 253 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ఒడుదొడుకులకు లోనయ్యాయి. కాసేపు లాభాల్లో ట్రేడయిన సూచీలు ప్రధాన షేర్లలో విక్రయాలతో నష్టాల్లోకి జారుకున్నాయి. ఓ దశలో సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 24,900 దిగువకు చేరింది. చివరకు రెండు ప్రధాన సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 82,571.67 పాయింట్ల (క్రితం ముగింపు 82,515.14) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,523.16 82,661.04 మధ్య కదలాడింది. చివరకు 823 పాయింట్ల నష్టంతో 81,691.98 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,825.90 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 253 పాయింట్ల నష్టంతో 24,888 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.60 గా ఉంది

సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, టైటాన్, ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఎంఅండ్‌ఎం, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బజాజ్‌ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్సు 3,382 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంతో విమానయానరంగ షేర్లు నష్టపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) షేర్లు 3 శాతం పైగా క్షీణించాయి. స్పైస్‌జెట్ షేరు విలువ 1.78 శాతం మేర పడిపోయింది. మరోవైపు అమెరికా ప్రీమార్కెట్‌లో బోయింగ్ షేర్లు 8 శాతం మేర పతనమయ్యాయి.

**కారణాలు ఇవే..**

ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లు నేడు నష్టాల్లో ముగిశాయి. హాంగ్‌సెంగ్ 1.36 శాతం, జపాన్ నిక్కీ 0.65 శాతం, ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ 0.31 శాతం నష్టంతో ముగిశాయి.

కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం అమ్మకాలకు దిగారు. రూ.446 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. సూచీలపై ఇది కాస్త ఒత్తిడి పెంచింది.

అమెరికా ఇరాన్ మధ్య ఉద్రికత్తల కారణంగా క్రూడ్ ఫ్యూచర్లు 4 శాతం పైగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 2.90 డాలర్లు పెరిగి 69.77 డాలర్లకు చేరింది.

# పోలీసుల ముందే రెచ్చిపోయింది..
## సోషల్ మీడియాలోనూ చిందులు.. చివరకు..!



గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం అనేది ఒకప్పుడు అవివేకంతో జరిగేది.. ఇప్పుడు అతి తెలివితో జరుగుతోంది. ఆ అతి తెలివి ఎలాంటిది అంటే... వైరంతోనే వైరల్ అవుతామనే అపోహ కల్పిస్తుంది. అందుకే ఇటీవలి కాలంలో అనవసర వివాదాలతో అవాంఛనీయ ప్రచారాన్ని తెచ్చుకుంటున్న సెలబ్రిటీలు ఎందరో కనిపిస్తున్నారు. అలాంటి వారిని చూసినప్పుడు చుట్టాలున్నారు జాగ్రత్త అనేది సినిమా తీశారు గానీ చట్టాలున్నాయి జాగ్రత్త అనే సినిమా కూడా ఎవరైనా తీసి వీళ్లకి చూపించి ఉంటే బాగుండు అనిపిస్తుంటుంది.

**ట్రెండింగ్‌లో కల్పిక**

అది అలా ఉంచితే... సినీ నటి కల్పిక అనగానే ఒకప్పుడు అయితే ఎవరామె? అని అడిగినవాళ్లే ఎక్కువ. అయితే ఇప్పుడు మాత్రం ఓహో ఆ అమ్మాయా? పబ్‌లో గొడవపడింది ఆమెనా? అని వెంటనే గుర్తుపడుతున్నారు. మరి ఇలాంటి ప్రచారం ఆమె కెరీర్‌కు ఎంతవరకూ ఉపకరిస్తుందో ఆమెకే తెలియాలి కానీ.. ఆమె వ్యక్తిగత జీవితానికి ఏ మాత్రం ఉపకరించదని పోలీసులు తమ చర్యల ద్వారా తేల్చి చెప్పారు.

**చిలికి చిలికి గాలివానలా..**

హైదరాబాద్ నగరంలో ప్రిజమ్ పబ్ అంటే తెలియని పార్టీ ప్రియులు ఉండరు. ఓ రకంగా చెప్పాలంటే వందకు పైగా పబ్స్ ఉన్న సిటీలో టాప్ 5 ప్లేస్‌లో ఉంటుంది. అలాంటి చోటకి వెళ్లి తాను సెలబ్రిటీని కాబట్టి బర్త్‌డే కేక్ తనకు కాంప్లిమెంట్రీ ఇవ్వాలని అడగడం, దానికి తాము ఒప్పుకోకపోవడంతో కల్పిక గొడవ సృష్టించారని పబ్ సిబ్బంది ఆరోపణ... ఆ గొడవ చిలికి చిలికి గాలివానలాగా మారింది అనడం కన్నా కల్పిక తన ఇంటర్వ్యూల ద్వారా సోషల్ వేదికలపై హల్ చల్ ద్వారా మరింత రచ్చ చేసింది అనడం సబబుగా ఉండొచ్చు.

**కల్పికపై కేసు**

ఆ వివాదం ద్వారా ఎంత రచ్చ చేయాలో అంత రచ్చ చేసింది కల్పిక. దాదాపుగా ఓ వారం రోజుల పాటు ఆ వివాదం సజీవంగా ఉండేలా తన వంతు సఫలయత్నం చేసిందామె. ఏమైతేనేం.. జనం కొత్త వివాదాల అన్వేషణలో తలమునకలవడంతో ప్రస్తుతం కల్పిక వ్యవహారం కాస్త సద్దుమణిగింది. అయితే పబ్‌లో గొడవను సామరస్యంగా పరిష్కరిద్దామని తాము చూస్తే ఆ సందర్భంగా కల్పిక తమపై వీరంగం చేసిందనే అభిప్రాయంతో ఉన్న పోలీసులు మాత్రం విషయాన్ని అంత తేలిగ్గా మర్చిపోలేదు. పకడ్బందీగా కేసు తయారు చేసి కల్పికను బుక్ చేసేశారు. గత నెలాఖరులో ప్రిజం పబ్‌లో అల్లర్లు సృష్టించిందనే ఆరోపణలతో నటి కల్పిక గణేష్‌పై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**పోలీసుల ఎదుటే రెచ్చిపోయిన బ్యూటీ**

పబ్‌లో గొడవ జరుగుతుందనే సమాచారం మేరకు తాము సంఘటనా స్థలానికి చేరుకున్నామని అయితే తమ సమక్షంలోనే నటి పబ్ సిబ్బందిని దుర్భాషలాడిందని కేసు పెట్టారు. అంతేకాక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడానికి కోర్టు నుంచి పోలీసులు అనుమతి కోరారు. అనంతరం గురువారం కోర్టు అనుమతి పొందిన తర్వాత పోలీసులు ఆమెపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సో.. విచారణ నిమిత్తం తమ ముందు హాజరు కావాలని కల్పికకు పోలీసులు రేపో మాపో నోటీసు జారీ చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ వివాదాన్ని కల్పిక ఇకపై ఎలా ముగించబోతోంది అనేది వేచి చూడాల్సి ఉంది.



## గద్దర్ పురస్కారాలు.. ఉత్తమ చిత్రానికి 4 అవార్డులు: దిల్ రాజు

గద్దర్ ఫిల్మ్ అవార్డుకు ఎంపికైన ఉత్తమ చిత్రానికిగానూ నాలుగు అవార్డులు ఇవ్వనున్నట్టు నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు.

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం అందించనున్న గద్దర్ పురస్కారాలపై ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆ విషాదరకర ఘటనపై మౌనం పాటిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం, అవార్డుల వివరాలు వెల్లడించారు.

“14 ఏళ్ల తర్వాత జరగనున్న అవార్డుల వేడుకను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎఫ్‌డీసీతోపాటు ఇండస్ట్రీకీ ఉంది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు వేడుక ప్రారంభమవుతుంది. ఆ ఈవెంట్ ‘ఐ & పీఆర్’ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సినీ అభిమానులకు చేరువవ్వాలని కోరుకుంటున్నాం. 2014 నుంచి 2023 వరకు.. బెస్ట్ ఫిల్మ్ (ఏడాదికి మూడు చొప్పున)కు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లు అవార్డులు అందుకుంటారు. ఉత్తమ చిత్రాలకుగానూ ఇలా నలుగురికి పురస్కారాలు ఇవ్వనుండడం తొలిసారి. అందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరుతున్నా” అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా ఈ అవార్డుల కార్యక్రమం జరగనుంది.



## అందుకు వందశాతం కారణం అల్లు అరవింద్, అర్జునే: బన్నీ వాస్

‘మిత్రమండలి’ టీజర్ విడుదల కార్యక్రమంలో నిర్మాత బన్నీవాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం ‘మిత్రమండలి’ . ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ఇందులో పాల్గొన్న నిర్మాత బన్నీ వాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన ప్రయాణంలో భాగమైన నిర్మాత అల్లు అరవింద్ కు ధన్యవాదాలు చెప్పారు.“మిత్రమండలి’.. నలుగురు కుర్రాళ్లు కూర్చొని సరదాగా మాట్లాడుకుంటే ఎలా ఉంటుందో అలా ఉంటుందీ చిత్రం. నేను ఇలాంటి చిత్రాలు నిర్మించడానికి స్ఫూర్తి ‘జాతి రత్నాలు’. ఇదే విషయాన్ని ఇప్పటికే చాలా సందర్భాల్లో చెప్పాను. ఈ సినిమా కోసం యువ బృందం ఎంతో శ్రమించి వర్క్ చేసింది. మేము వారికి సపోర్ట్ చేశాం. సినిమాలో ప్రతి ఒక్కరూ అద్భుతంగా వర్క్ చేశారు. సత్య - వెన్నెల కిషోర్ ట్రాక్ చక్కగా కుదిరింది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. ఈ సందర్భంగా అల్లు అరవింద్, జాతిరత్నాలు దర్శకుడు అనుదీప్‌కు ధన్యవాదాలు చెబుతున్నా.

నా జీవితంలో తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయం అల్లు అరవింద్‌తోనే స్పెండ్ చేశా. మా ఇంట్లో కంటే ఎక్కువ రోజులు ఆయన ఇంట్లోనే ఉన్నా. ఆయన్ని చూస్తుంటే మాకొక గాడ్ ఫాదర్ అనే ఫీలింగ్ వస్తుంది. మాకెంతో సపోర్ట్ ఇచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు. ఆయన ఇచ్చిన క్రమశిక్షణ వల్లే మేము ఈస్థాయికి వచ్చాం” అని బన్నీ వాస్ తెలిపారు. ‘టీజర్’లోని సన్నివేశాలను ఉద్దేశించి మీ జీవితంలో ఇలాంటి ప్రేమకథలు ఏమైనా ఉన్నాయా? అని యాంకర్ ప్రశ్నించగా.. “సుమారు 19 ఏళ్ల వయసులో నేను అరవింద్ గారి వద్దకు వచ్చా. అప్పటి నుంచి బన్నీ దగ్గర నన్ను పెట్టారు. నా జీవితం మొత్తం వారి వద్దే గడిచిపోయింది. నా జీవితంలో లవ్ పార్ట్ ఏదైనా మిస్ అయిందంటే దానికి వందశాతం కారణం అల్లు అరవింద్, బన్నీనే” అని ఆయన నవ్వులు పూయించారు.

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అల్లు అరవింద్ మాట్లాడుతూ.. “నేను ఎక్కువ శాతం యువ టాలెంట్‌తో టైమ్ స్పెండ్ చేస్తుంటా. అదే నా బలం. కథ తెలియకుండానే బన్నీ వాస్ నిర్మించిన ఈ సినిమా చూసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇన్‌స్టాలో నాకొక ఫేక్ ఐడీ ఉంది. అందరినీ ఫాలో అవుతుంటా (నవ్వులు). సోషల్‌మీడియాలో నెటిజన్లు పెట్టే కామెంట్స్ చూడలేం. చదవలేం. అందుకునే నేనొక అకౌంట్ క్రియేట్ చేసుకున్నా. ఆ విధంగా అందరినీ ఫాలో అవుతుంటా. నిన్ను (నిహారిక) కూడా ఫాలో అవుతుంటా. నీకు మంచి భవిష్యత్తు ఉంది” అని చెప్పారు.




## రానా ఏమన్నారంటే..?

వెంకటేశ్ , రానా ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ‘రానా నాయుడు 2’ . ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రానా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

వెంకటేశ్ , రానా ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ‘రానా నాయుడు 2’ . 2023లో విడుదలైన ‘రానా నాయుడు’కు కొనసాగింపుగా ఇది సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు రానా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా సిరీస్‌లో భాగంగా వెంకటేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించడంపై మాట్లాడారు.

“హిందీ భాషలో కొన్ని పదాలకు నాకు సరైన అర్థం తెలియదు. పార్ట్ 1 కోసం హిందీ డబ్బింగ్ చెబుతున్నప్పుడు వాటిని కేవలం డైలాగ్స్ మాదిరిగానే చూశా. బాబాయ్‌ని తిడుతున్నానని అనుకోలేదు. కానీ, తెలుగు డబ్బింగ్‌కు వచ్చేసరికి చాలా ఇబ్బందిపడ్డా. కొన్ని డైలాగ్‌లు చెప్పాల్సి వచ్చినప్పుడు.. ‘ఇప్పుడు ఏం చేయాలి? ఎలా ఈ డైలాగ్స్ చెప్పాలి’ అని ఆలోచించా. నటీనటులుగా ఆయా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసినప్పుడు ఇలాంటివి చేయక తప్పదని అర్థం చేసుకున్నా” అని రానా తెలిపారు.

“నటుడిగా నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాటినుంచి ఏదోఒక ప్రాజెక్ట్ కోసం తప్పకుండా బాబాయ్‌తో కలిసి వర్క్ చేయాలని కలలు కన్నాను. ఈ సిరీస్‌తో నా కల నెరవేరింది. ఇలాంటి ప్రాజెక్ట్ మేమిద్దరం గతంలో ఎప్పుడూ చేయలేదు. ఇదొక విభిన్నమైన సిరీస్. ఒక నటుడిగా ఆయన మాలో ఎంతో స్ఫూర్తి నింపారు. సెట్‌లో నన్ను నేను మరింత మెరుగుపరచుకునేలా ఆయన చేసేవారు. ఇందులో నా పాత్ర పేరు రైనా. కానీ బాబాయ్ తరచూ ‘రానా రానా’ అని పిలిచేవారు. సెట్‌లో డైలాగ్ చెబుతున్నప్పుడు.. ఆయన నన్ను తిడుతున్నారో లేదా పాత్రను తిడుతున్నారో అర్థమయ్యేది కాదు” అని అన్నారు. ‘రానా నాయుడు’ సిరీస్‌ను తన కుటుంబసభ్యులందరూ వీక్షించారని చెప్పారు.

యాక్షన్ క్రైమ్ డ్రామాగా ‘రానా నాయుడు’ సిద్ధమైంది. దీనికి సుప్రన్ వర్మ, కరణ్ అన్షు మన్ దర్శకత్వం వహించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ ప్రాజెక్ట్ హిందీతోపాటు తెలుగులోనూ ప్రేక్షకులను అలరించింది. ఇందులో అసభ్య పదజాలం ఎక్కువగా ఉపయోగించారంటూ నెటిజన్లు ట్రోల్స్ కూడా చేశారు.





## అహ్మదాబాద్ విమాన ప్రమాదం..
## 12th ఫెయిల్ నటుడి ఇంట్లో విషాదం

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన 12th ఫెయిల్ నటుడు విక్రాంత్ మాస్సేకు తీవ్ర విషాదం మిగిల్చింది. ఇదే ఫ్లైట్‌లో తన బంధువు మృతి చెందినట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తన మామయ్య అయిన క్లిఫర్డ్ కుందర్ కుమారుడు క్లైవ్ కుందర్ మరణించాడని విక్రాంత్ తన బాధను వ్యక్తం చేశారు. విక్రాంత్ తన బంధువు మృతికి సంతాపం తెలుపుతూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్ట్ చేశారు. ఈ ప్రమాద బాధిత కుటుంబాలందరికీ తన సానుభూతిని తెలియజేశారు.

విక్రాంత్ మాస్సే ఇన్‌స్టాలో రాస్తూ..' "ఈరోజు అహ్మదాబాద్‌లో జరిగిన ఊహించలేని విషాదం జరిగింది. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను చూసి నా హృదయం ముక్కలైంది. ఈ ఘటనలో మా మామ క్లిఫోర్డ్ కుందర్ తన కుమారుడు క్లైవ్ కుందర్‌ను కోల్పోయారని తెలిసి మరింత బాధగా ఉంది. ఎందుకంటే అతను ఈ విమానంలో పనిచేస్తున్న మొదటి అధికారి" అని రాసుకొచ్చారు.

కాగా.. గురువారం మధ్యాహ్నం 242 మంది ప్రయాణికులతో లండన్ బయలు దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం బయలుదేరిన కొద్ది నిమిషాలకే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోగా.. రమేశ్ విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా మరణించారు.





# ఇంగ్లండ్‌తో తొలి టెస్టు.. భారత తుది జట్టు ఇదే!

## జడేజాకు నో ఛాన్స్?



భారత్‌ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆరంభానికి కేవలం వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు లీడ్స్ వేదికగా జూన్ 20 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా భావిస్తోంది. ఈ క్రమంలో తొలి టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ఎంచుకున్నాడు. బంగర్ తన ఎంపిక చేసిన తుది జట్టులో ఓపెనర్లగా యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్‌కు అవకాశమిచ్చాడు.రోహిత్ శర్మ స్థానంలో ఓపెనర్‌గా రాహుల్ సరైనోడని స్టార్ స్పోర్ట్స్ చర్చాకార్యక్రమంలో బంగర్ అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా ఫస్ట్ డౌన్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్‌కు అతడు ఛాన్స్ ఇచ్చాడు. ఇక నాలుగో స్థానంలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ బ్యాటింగ్‌కు రావాలని సంజయ్ సూచించాడు.

ఇక ఎనిమిదేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్‌కు ఐదో స్థానంలో ఈ భారత మాజీ క్రికెటర్ చోటు ఇచ్చాడు. ఈ జట్టులో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్, ఆల్‌రౌండర్ కోటాలో నితీష్ కుమార్ రెడ్డిలకు స్థానం దక్కింది. స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్.. ఫాస్ట్ బౌలర్ల కోటాలో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్‌ను బంగర్ ఎంపిక చేశాడు. అయితే ఈ మాజీ బ్యాటింగ్ కోచ్ ఎంపిక చేసిన జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు దక్కకపోవడం గమనార్హం. జడేజాతో పాటు యువ సంచలనం సాయిసుదర్శన్‌ను కూడా అతడు పరిగణలోకి తీసుకోలేదు.

**ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు బంగర్ ఎంచుకున్న భారత తుది జట్టు**

**యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్, శుబ్‌మన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్,- జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్**



## బంగ్లాదేశ్ కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్.. అధికారిక ప్రకటన


బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు కొత్త వన్డే కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మీరాజ్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు గురువారం(జూన్ 12) విలేకరుల సమావేశంలో వెల్లడించింది. ఈ ఆల్ రౌండర్ నజ్ముల్ హొస్సేన్ శాంటో స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. బంగ్లా వన్డే కెప్టెన్‌గా మెహదీ హసన్ ఏడాది పాటు కొనసాగనున్నాడు.

వచ్చే నెలలో శ్రీలంకతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌తో మీరాజ్ తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు. మీరాజ్ గతంలో నజ్ముల్ హుస్సేన్ శాంటో డిప్యూటీగా వ్యవహరించాడు. శాంటో గైర్హాజరీలో నాలుగు మ్యాచ్‌లలో బంగ్లా జట్టును అతడు నడిపించాడు.

"బంగ్లాదేశ్ కెప్టెన్‌గా ఎంపికవ్వాలన్ననా కల ఈరోజు నిజమైంది. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బోర్డుకు ధన్యవాదాలు. ఇది నాకు, నా కుటుంబానికి గర్వకారణమైన క్షణం. మా జట్టుపై నాకు పూర్తి నమ్మకం ఉంది. జట్టును విజయపథంలో నడిపించడమే నా లక్ష్యమని" మెహదీ హసన్ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నాడు.


మెహిదీ హసన్ ఇప్పటివరకు 105 వన్డేలు ఆడి 1617 పరుగులతో పాటు 110 వికెట్లు పడగొట్టాడు. అతడు ప్రస్తుతం ఐసీసీ వన్డే ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు. కాగా బంగ్లాదేశ్ జట్టుకు ప్రస్తుతం మూడు ఫార్మాట్లలో వేర్వేరు కెప్టెన్లు ఉన్నారు. టెస్ట్ జట్టుకు నజ్ముల్ హుస్సేన్ శాంటో కెప్టెన్‌గా ఉండగా, టీ20ల్లో లిట్టన్ దాస్, వన్డేల్లో మెహిదీ హసన్ మీరాజ్ సారథులుగా ఉన్నారు.

## ఏదైనా ప్రత్యేకంగా చేయడానికి ఇదే సరైన సమయం: గౌతమ్ గంభీర్




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్లతో సీనియర్లు లేకుండానే గిల్ సేన ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రత్యేకంగా చేసి తమను తాము నిరూపించుకోవడానికి యువ ఆటగాళ్లకు ఇదే సరైన సమయం అని.. టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. టీమ్ఇండియా , ఇంగ్లండ్ మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. భారత జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, రిషభ్ పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ , రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్లతో సీనియర్లు లేకుండానే గిల్ సేన ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రత్యేకంగా చేసి తమను తాము నిరూపించుకోవడానికి యువ ఆటగాళ్లకు ఇదే సరైన సమయం అని టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు.

'ప్రస్తుతం మనం ఉన్న స్థితిని రెండు కోణాల్లో చూడొచ్చు. మొదటిది.. మనం ముగ్గురు అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు (రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్) లేకుండా బరిలోకి దిగుతున్నాం. రెండో కోణం.. దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మన చేతుల్లో అద్భుతమైన అవకాశం ఉంది. ఈ బృందంలో.. ఆకాంక్ష, అభిరుచి, ప్రత్యేకంగా ఏదైనా చేయాలనే నిబద్ధత ఉందని నేను భావిస్తున్నాను. మనం త్యాగాలు చేస్తే.. మనం కంఫర్ట్ జోన్ల నుంచి బయటకు వస్తే.. మనం పోరాడటం ప్రారంభిస్తే.. ప్రతి సెషన్, ప్రతి గంట, ప్రతి బంతినీ మనం చిరస్మరణీయంగా మలుచుకోగలం. దాన్ని ఈరోజు నుంచే ప్రారంభించండి. దేశం కోసం ఆడటం కంటే పెద్ద గౌరవం మరొకటి లేదు' అని గంభీర్ భారత జట్టుతో అన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇంగ్లండ్ టూర్‌కు ముందు ఐపీఎల్ మధ్యలో టెస్ట్ ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్లను కొద్ది రోజుల వ్యవధిలో ఒకరి తర్వాత మరొకరు ప్రకటించారు. అంతకుముందు ఆస్ట్రేలియా టూర్ మధ్యలో రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.



## జూన్ 14న బీసీసీఐ ఆధ్వర్యంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం!



ఇటీవల ఆర్సీబీ విజయోత్సవం సందర్భంగా తొక్కిసలాట జరిగి 11 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్లు వేడుకలు నిర్వహించుకునే వేళ పాటించాల్సిన కొత్త నియమ, నిబంధనల విషయమై చర్చించేందుకు జూన్ 14న బీసీసీఐ ఆధ్వర్యంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరగనున్నట్లు సమాచారం.

ఆర్సీబీ జూన్ 4న నిర్వహించిన విజయోత్సవం సందర్భంగా తొక్కిసలాట జరిగి 11 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్లు వేడుకలు నిర్వహించుకునే వేళ పాటించాల్సిన కొత్త నియమ, నిబంధనల విషయమై చర్చించేందుకు జూన్ 14న బీసీసీఐ ఆధ్వర్యంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవం సందర్భంగా తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు వేలాది మంది జనాలు గుమిగూడినప్పుడు దురదృష్టవశాత్తూ ఈ దుర్ఘటన జరిగింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా బీసీసీఐ పలు మార్గదర్శకాలను జారీ చేయనుంది.

'ఐపీఎల్ విజయోత్సవాల నిర్వహణకు సంబంధించి నూతన నిబంధనలను రూపొందించడానికి జూన్ 14న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేస్తుంది. ఇది వర్చువల్‌గా జరగవచ్చు' అని బీసీసీఐ వర్గాలు మీడియాకు తెలిపాయి.

తొక్కిసలాటకు సంబంధించి కర్ణాటక పోలీసులు కర్ణాటక క్రికెట్ బోర్డు అడ్మినిస్ట్రేటివ్ కమిటీ, ఆర్‌సీబీతో పాటు ఇతరులపై కూడా ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ దుర్ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## శుభ్‌మన్ గిల్ బ్యాట్‌పై 'ప్రిన్స్'..!

**బీసీసీఐ నిర్వహించిన పోటోషూట్ చిత్రాల్లో గిల్ బ్యాట్‌పై ఎంఆర్ఎఫ్ లోగోతో పాటు 'ప్రిన్స్' అనే ట్యాగ్ కనిపించింది.**




టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం శుభ్‌మన్ గిల్ భారత టెస్టు జట్టు సారథ్య బాధ్యతలు స్వీకరించాడు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్, టీమ్ఇండియా మధ్య అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నిర్వహించిన పోటోషూట్ చిత్రాలను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ చిత్రాల్లో గిల్ బ్యాట్ పై ఎంఆర్ఎఫ్ లోగోతో పాటు అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'ప్రిన్స్' అనే ట్యాగ్ కనిపించింది.

అయితే దీనిపై సోషల్ మీడియాలో పలు విమర్శలు వస్తున్నాయి. విరాట్ కోహ్లీని అభిమానులు 'కింగ్' అని, సచిన్ తెందూల్కర్‌ను 'గాడ్' అని పిలుస్తుంటారు. కానీ వారు ఎప్పుడూ తమ బ్యాట్‌లపై ఫ్యాన్స్ ఇచ్చి ట్యాగ్‌లను ఉపయోగించలేదు. గిల్ మాత్రం 'ప్రిన్స్' అని తన బ్యాట్ మీద రాసుకున్నాడంటూ గిల్‌ను తప్పుబడుతూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. 'శుభ్‌మన్ గిల్‌కు స్వీయ వ్యామోహం ఎక్కువగా ఉంది. అతడి అయిదేళ్ల కెరీర్‌లో విదేశాల్లో ఒక్క సెంచరీ కూడా లేదు. టెస్ట్ యావరేజ్ 35 కన్నా తక్కువగా ఉంది. సెనాపై కూడా మంచి రికార్డు లేదు.' ''సచిన్ తెందూల్కర్ తన బ్యాట్ మీద ఎప్పుడూ 'గాడ్' అని రాసుకోలేదు. అలాగే విరాట్ కోహ్లీ కూడా 'కింగ్' అనే ట్యాగ్ ఉన్న బ్యాట్‌తో ఆడలేదు. బాగా ఆడితే దిగ్గజాల నుంచే ట్యాగ్స్ వస్తాయి. కానీ సోషల్ మీడియా నుంచి కాదు'' అని పలువురు క్రికెట్ అభిమానులు తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టులు పెట్టారు.